సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



రెవెన్యూ డివిజన్ అయ్యేనా?

మంత్రి పొంగులేటి ప్రకటన నేపథ్యంలో 'దుబ్బాక రెవెన్యూ డివిజన్‌పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. – వివరాలు 8లో ▸



జాతీయ పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. వివరాలు 8లో ▸



వరినారు సాగులో..

ప్రస్తుతం రబీవరి సాగు కోసం రైతులు వరి నారు పెంపకం చేపట్టారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పత్తి రైతులను ఆదుకోవాలి

- కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఎంపీ షెట్కార్ వినతి



నారాయణఖేడ్: పత్తి పంటకు సరైన మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎంపీ సురేశ్ షెట్కార్ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కోరారు. ఈ ఏడాది పత్తికి రూ.7,521 ప్రకటించినా రైతులకు మాత్రం దక్కడం లేదన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలను వివరిస్తూ కేంద్రమంత్రికి గురువారం షెట్కార్ వినతి పత్రం అందించారు. వాతావరణంలో నెల కొన్న మార్పుల వల్ల అధిక తేమను సాకుగా చూపి కొనుగోలు దారులు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.100 నుంచి 200ల వరకు తక్కువగా చెల్లిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికశాతం రైతులు సీసీఐకి పత్తిని విక్రయించారని, అందువల్ల రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఖేడ్‌లో నవోదయ ఏర్పాటు చేయండి

సంగారెడ్డి జిల్లాకు మంజూరు అయిన నవోదయ విద్యాలయాన్ని కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న నారాయణఖేడ్ ప్రాంతంలోనే నెలకొల్పాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరికి జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు 9 నవోదయ రెసిడెన్షియల్స్ మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సఫాయి కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలి

- కమిషన్ చైర్మన్ వెంకటేశన్



మాట్లాడుతున్న వెంకటేశన్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని సఫాయి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ కరంచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ డిమాండ్ చేశారు. సఫాయి కార్మికులకు వారి కుటుంబసభ్యులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలసి జిల్లాలోని సఫాయి కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశన్ మాట్లాడుతూ...వివిధ కార్పొరేషన్ల ద్వారా సఫాయి కార్మికులకు ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు అందించాలన్నారు. జిల్లాలోని నెల రోజుల్లోగా వారికి గుర్తింపు కార్డులు, ఈపీఎఫ్ ఖాతా నంబర్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా సఫాయి కార్మికులకు భద్రత సామగ్రిని అందించాలన్నారు. సఫాయి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 01124648924కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎం.వెంకటేశన్‌కు ఐబీ వద్ద కలెక్టర్ క్రాంతి ,ఎస్పీ రూపేశ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, జెడ్పీసీఈవో జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

- పాశమైలారం పారిశ్రామికవాడలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించిన ఎస్పీ



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించిన ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు. సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి, సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. అన్ని పరిశ్రమలకు సంబంధించిన యాజమాన్యాలు సొసైటీలో చేరాలని సూచించారు. ఈ సొసైటీ ద్వారా పరిశ్రమలు, పరిశ్రమల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల, మహిళా ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వివిధ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

సొంత 'గూటి'కి!

గృహనిర్మాణశాఖకు తిరిగి వచ్చిన అధికారులు

- డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులంతా తిరిగొస్తున్న వైనం
- ఇటీవలే జిల్లా మేనేజర్ నియామకం
- ఇందిరమ్మ గృహాల నిర్మాణం దిశగా ప్రభుత్వం చర్యలు



కలెక్టరేట్‌లో గృహనిర్మాణశాఖ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : గృహనిర్మాణ శాఖ బలోపేతం దిశగా రేవంత్ సర్కారు అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఈ శాఖకు జిల్లా మేనేజర్ పోస్టులో ఓ అధికారిని నియమించిన ప్రభుత్వం తాజాగా, డిప్యూటేషన్‌పై వివిధ శాఖలకు వెళ్లిపోయిన ఇంజనీరింగ్, ఇతర అధికారులను తిరిగి సొంత గూటికి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, నలుగురు అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఈ శాఖకు చేరుకున్నారు. కొద్ది రోజుల్లోనే మరికొందరు కూడా రిపోర్టు చేయనున్నారు. వీరికి జిల్లాలో వివిధ డివిజన్లు, మండలాల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి రెండు, మూడు మండలాలకు ఒక ఏఈని నియమిస్తున్నారు. డివిజన్‌కు ఓ డీఈని కేటాయిస్తున్నారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు తదితర కార్యాలయ సిబ్బంది కూడా త్వరలోనే రానున్నట్లు గృహనిర్మాణ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ'పథకం

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ గృహాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రత్యేక సర్వే కూడా కొనసాగుతోంది. తాజాగా ఇంజనీరింగ్, ఇతర అధికారులతో ఈ కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలో ఈ గృహనిర్మాణ శాఖలో పనిచేసిన చాలామంది ఇంజనీరింగ్ అధికారులు హైదరాబాద్ వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు, ఆర్‌అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, జీహెచ్ఎంసీ వంటి శాఖలకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఇప్పుడు వీరు తిరిగి గృహ నిర్మాణశాఖకు చేరుకుంటున్నారు.

ఇన్నాళ్లు అవుట్‌సోర్సింగ్ అధికారితో..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకాన్ని గృహ నిర్మాణశాఖ ద్వారా కాకుండా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు, ఆర్‌అండ్‌బీ, పబ్లిక్‌హెల్త్ వంటి శాఖలకు అప్పగించింది. ఈ శాఖల ద్వారానే డబుల్ బెడ్‌రూం గృహాలను నిర్మించింది. గృహనిర్మాణశాఖలో ఉన్న అధికారులు, సిబ్బంది దాదాపు అందరినీ వివిధశాఖలకు పంపించడంతో ఈ శాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. దాదాపు ఎనిమిదేళ్లపాటు ఈ శాఖ జిల్లా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎవరూ లేకుండా పోయారు. అవుట్‌సోర్సింగ్ అధికారితోనే ఈ కార్యాలయాన్ని నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఈ శాఖకు జిల్లా మేనేజర్‌తో పాటు, ఇంజనీరింగ్ అధికారులు కూడా రావడంతో కలెక్టరేట్‌లో ఈ కార్యాలయంలో పాలన పరమైన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

కొనసాగుతున్న పరిశీలన..

ఇందిరమ్మ గృహాల కోసం జిల్లా వ్యాప్తంగా 3.18 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఈ నెల 9న ప్రారంభమైంది. ఇప్పటి వరకు సుమారు 17 వేల దరఖాస్తులను వెరిఫికేషన్ చేశారు. సుమారు ఐదు శాతం వరకు పరిశీలన పూర్తయిందని గృహ నిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాత ఇందిరమ్మ గృహాల నిర్మాణం పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. గృహ నిర్మాణశాఖకు తిరిగిన వచ్చిన వారికి జిల్లాలోని ఆయా డివిజన్లలో పోస్టింగ్‌లు ఇస్తున్నామని ఆ శాఖ జిల్లా మేనేజర్ బి.పుష్పలత 'సాక్షి'తో పేర్కొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

కొత్త రేషన్‌కార్డులపై మంత్రి ప్రకటన

- సంక్రాంతి తర్వాత వచ్చే అవకాశం
- ప్రజాపాలనలో దరఖాస్తులు



బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి అనుమతినివ్వడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్నేళ్లుగా రేషన్ కార్డుల జారీ నిలిపివేయడంతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా రేషన్ కార్డు లేని వారి నుంచి దరఖాస్తుల స్వీకరించారు. సంక్రాంతి తర్వాత అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన పట్ల రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించేందుకు సంబంధిత అధికారులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఇంటింటి కుటుంబ, కుల గణన సర్వే ఆధారంగా నూతన కార్డులు జారీ చేయనున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు స్మార్ట్ చిప్‌తో కూడిన కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో ఉన్న మొత్తం కార్డులు	3,78,524
ఆహార భద్రత కార్డులు	3,52,300
అంత్యోదయ కార్డులు	26,124
అన్నపూర్ణ కార్డులు	100
మొత్తం లబ్ధిదారులు	12,32,335

అన్ని పథకాలకు రేషన్‌కార్డే ప్రామాణికంగా...

అర్హులైన వారికి గత ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వాలు ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా రేషన్ కార్డును ప్రామాణికంగా చేసింది. దీంతో పేదలకు రేషన్ బియ్యంతోపాటు పథకాలకు అనర్హులుగా మిగిలారు. అర్హులైన పేదలు గత కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రేషన్ కార్డుల జారీకి ఇటీవల మంత్రి వెల్లడించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులు పాత కార్డులో పేర్లు తొలగించి కొత్త పేర్లు నమోదు చేసేందుకు సుమారు మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఆ వివరాలు కూడా ఇప్పటివరకు నమోదు చేయలేదు. దరఖాస్తు చేసుకున్న వాటిలో 22,074 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేయనున్న ఆరో గ్యారంటీల కోసం దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా రేషన్ కార్డులు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

నెలాఖరుకల్లా ఇళ్ల సర్వే పూర్తి

- సర్వేయర్లకు కలెక్టర్ ఆదేశం
- ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



విద్యార్థినులతో భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి/వట్‌పల్లి/జోగిపేట(అందోల్)/ : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఈ నెలఖారులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. గురువారం సంగుపేట, చౌటుకూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లు లేకుండా దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్‌లో పొందుపరచాలన్నారు. కలెక్టర్ వెంట మెప్మా పీడీ గీత, అందోల్ ఆర్డీవో పాండు, తహసీల్దారు విష్ణుసాగర్, ఎంపిడీవో రాజేశ్ తదితరులున్నారు.

విద్యార్థులతో కలసి భోజనం

జోగిపేట మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెలలో ఆరుసార్లు నాన్ వెజ్, నాన్‌వెజ్ లేని రోజు గుడ్డును పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం సంతోషమేనా అని కలెక్టర్ ప్రశ్నించగా...విద్యార్థినులు సంతోషంగా ఉందని సమాధానమిచ్చారు. పాఠశాల పరిసరాలతో పాటు వంట గదిని, వంటకు ఉపయోగించుకునే సామగ్రి, పప్పు దినుసులు, బియ్యం, వంట నూనెలను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలసి కలెక్టర్ భోజనం చేశారు. విద్యార్థినులు నెయ్యిని వేసుకోకపోవడాన్ని గమనించిన కలెక్టర్ మీరు నెయ్యిని ఎందుకు వేసుకోవడంలేదని అడిగారు. ప్రతీరోజు నెయ్యిని వాడాలని విద్యార్థినులకు సూచించారు.

వారి సమాచారం ఇవ్వండి

- అనుమానాస్పద వ్యక్తులపై కాలనీవాసులకు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచన

పటాన్‌చెరు టౌన్: కాలనీల్లో అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ వడ్డెర కాలనీలో గురువారం తెల్లవారు జామున కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 60 ద్విచక్రవాహనాలు, 1 ఆటోలు, 3 టాటాఏసీ వాహనాలు, 3 కార్లను స్వాధీనం చేసుకుని వాటి పత్రాలను తనిఖీ చేశారు. పత్రాలు,బీమా, నంబర్‌ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలపై ట్రాఫిక్ అధికారులు రూ.63,500 జరిమానా విధించారు. ఆ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్‌లు రూ.51,300 రికవరీ చేశారు. తనిఖీల్లో అమీన్‌పూర్, బీడీఎల్, బొల్లారం, జిన్నారం సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం

అసెంబ్లీలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్‌లో గురుకులాలు, హాస్టళ్లలో తాను చేసిన తనిఖీల్లో వెలుగుచూసిన సమస్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. శాసనసభలో గురువారం వసతిగృహాల పరిస్థితిపై జరిగిన చర్చలో పాల్గొన్న సంజీవరెడ్డి పలు అంశాలను ప్రస్తావించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గురుకులాలు, హాస్టళ్ల సమస్యల వలయంగా మారి విద్యార్థులు తిప్పలు పడ్డారని అన్నారు. ఒక గురుకులాన్ని సందర్శించగా 400మంది విద్యార్థులు ఉంటే 125 ఫ్యాన్లకు గాను 12 మాత్రమే పనిచేస్తున్నాయని, భోజన శాలలో 12 ఫ్యాన్లకు ఒక ఫ్యాను, ఒక ట్యూబ్‌లైట్ మాత్రమే పనిచేస్తుందని తెలిపారు. ఆర్వో ప్లాంటు చెడిపోయి మూడేళ్లు కావస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు జరిగాయని, 11వేల పైచిలుకు ఉపాధ్యాయులను నియమించినా ఇంకా టీచర్ల కొరత కొనసాగుతుందని తెలిపారు. తమ నియోజకవర్గం వెనుకబడి ఉన్నందున అన్ని పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



సంగారెడ్డిలో నిరసన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సంగారెడ్డిఎడ్యుకేషన్/నారాయణఖేడ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించడంతోపాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితితోపాటు వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకూ అంబేడ్కర్ చిత్రపటాలను పట్టుకుని నిరసనల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ...బీఆర్.అంబేడ్కర్ పీడిత వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని ఆయనను కించపరుస్తూ అమిత్ షా మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ తొలి నుంచి పైకి అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తూ లోపల ఆయన రాసిన రాజ్యాంగాన్ని లేకుండా చేయాలనే చూస్తోందని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని హెచ్చరించారు. తక్షణమే అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని, దీంతో పాటు అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఖేడ్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడినందుకు నారాయణఖేడ్‌లో గురువారం కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం అమిత్‌షా వ్యాఖ్యను నిరసిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో దళిత, సామాజిక, ప్రజాఉద్యమ నాయకులు, ప్రముఖ న్యాయవాది రామారావు ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఇమ్మయ్య, న్యాయవాది లక్ష్మి, విద్యావంతుల వేదిక అధ్యక్షుడు సైదులు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలేది..!

- యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వాడకం
- పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్
- పట్టించుకోని అధికారులు



పస్తాపూర్ సర్వీస్ రోడ్డు పక్కన పాలిథిన్ కవర్ల చెత్త

జహీరాబాద్ టౌన్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని ప్రభుత్వ ఆదేశాలను వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు కేవలం కాగితాలకే పరిమితం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో 40 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న పాలిథిన్ కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు రెండేళ్ల క్రితం హడావుడి చేసినా తర్వాతికాలంలో వారు కూడా ప్లాస్టిక్ నిషేధం అమలుపై శీతకన్నేశారు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు ప్లాస్టిక్ కవర్లను వాడుతుండటంతో ఖాళీ ప్రదేశాలు, మురికి కాలువలు ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లే కన్పిస్తున్నాయి. రెండేళ్ల క్రితం 40 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడిన వారిపై అధికారులు జరిమానా విధించారు. దీంతో కొన్నిరోజుల పాటు వ్యాపారులు పాలిథిన్ కవర్లను వాడటాన్ని ఆపేశారు. అధికారులు తనిఖీలు చేయడం తగ్గించడంతో మళ్లీ యథేచ్ఛగా వీటి వినియోగం మొదలైపోయింది. వ్యాపారులు, హోటళ్ల యాజమాన్యాలు ప్లాస్టిక్ కవర్లు రోడ్ల పక్కన పారబోస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జహీరాబాద్ బైపాస్ రోడ్డు పక్కన కవర్లను పడేయడంతో వాటిని పశువులు తింటున్నాయి. పారిశుద్ధ్య సమస్య నెలకొంది. జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, అందోల్ మున్సిపాలిటీల్లో 165 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 60 మెట్రిక్ టన్నుల వరకు ప్లాస్టికవర్లే ఉండటం గమనార్హం.

చర్యలు తీసుకోవాలి

పాలిథిన్ కవర్లను వాడటం వల్ల అనేక అనార్థాలు చోటుచేసుకునే అవకాశం ఉందని జనవిజ్ఞాన వేదిక సభ్యులు అభిప్రాయ పడుతున్నారు. పశువులు వీటిని తినడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నాయని, పర్యావరణానికి హాని కలిగించే అవకాశముందని చెబుతున్నారు. వస్త్రాలు, కాగితాలతో తయారు చేసిన సంచులు వాడేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లగా పాలిథిన్ కవర్ల నిషేధానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పోరుబాట పట్టినా పట్టించుకోరేం!

- 14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష
- స్తంభించిన విద్యా వ్యవస్థ
- విద్యార్థులపై తీవ్ర ప్రభావం!
- సమస్యలు పరిష్కరించే వరకు దీక్ష విరమించబోమంటున్న నేతలు



కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యాశాఖలోని సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ విలీనం చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరింది. దీంతో కస్తూర్బా పాఠశాలలో, భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియెట్‌తోపాటు పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న ఈ కీలక సమయంలో విద్యార్థులకు బోధన అందడం లేదు. ఇదివరకే సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాల్సిన సమయంలో సీఆర్‌టీలు దీక్షలో ఉండటంతో విద్యార్థులపై చదువుపై ప్రభావం పడే అవకాశం ఉంది. దివ్యాంగుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. భవిత కేంద్రాలలో పనిచేసే ఐఈఆర్పీలు కూడా దీక్షలో ఉండటంతో భవిత కేంద్రాలు కూడా మూతపడ్డాయి. తగిన శిక్షణతో పాటు ఫిజియోథెరపీ అందించడంతో పాటు పాఠశాలలో విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు ఒక కేర్ టేకర్‌తోపాటు చికిత్స అందించేందుకు ఫిజియోథెరపి నిపుణులను నియమించారు. వీరంతా కూడా దీక్షలో ఉండటంతో భవిత కేంద్రాలు మూసుకుపోయాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షలు విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడంతో విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 711 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 711 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులున్నారు. సీఆర్పీలు 111ఉన్నారు. వీరిలో సీఆర్పీలు తమ క్లస్టర్ పరిధిలో గల పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలిస్తారు. బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడం, పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూ డైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం వంటివి చేస్తుంటారు. వీరంతా సమ్మెలో ఉండటంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.

ఇవీ సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు

ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వీరు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వీరికి నెలకు రూ.19,250 ప్రభుత్వం వేతనంగా ఇస్తోంది. తమకు వేతనాలు పెంచడంతో పాటు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు ఆరోగ్య బీమా రూ.10 లక్షలు, పదవీ విరమణ పొందితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలు, ఉద్యోగి మరణిస్తే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రభుత్వ విద్యాశాఖ నియామాలలో వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీ వచ్చేవరకు దీక్ష చేస్తాం



అతి తక్కువ వేతనాలకే విధులు నిర్వహిస్తున్నాం. రెండు వారాలుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దారుణం. ప్రభుత్వం నుంచి హామీ వచ్చే దీక్ష విరమించే ప్రసక్తే లేదు.

– దత్తు, సీఆర్పీల జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు మెదక్ క్రీడాకారులు



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

తూప్రాన్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణగుప్త గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 నుంచి జమ్మూ కాశ్మీర్‌లోని ఎంపి క్రీడా మైదానంలో 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. 24 వరకు పోటీలు జరుగనున్న నేపథ్యంలో ఈ పోటీలకు రాష్ట్ర బాల, బాలికల జట్టుకు జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని వివరించారు. నవంబరు నెలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బాలికల జట్టులో కార్తీక, శ్రీకృతి, శిరీష, గీతిక, బాలుర జట్టులో విజయ్, శ్రీవాత్సవ, వరుణ్, నిషాంత్ రాష్ట్ర జట్టులో స్థానం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు వెంకట్ రెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



రాజు (ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దేగల వెంకటరామరాజు (53) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రాజుకు ఉదయం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ధరణి కుమార్, రాజేశ్, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.30 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కానిస్టేబుల్ అకస్మాత్తుగా మృతి చెందడంపై సీపీ అనురాధ సంతాపం వ్యక్తం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లిన వ్యక్తి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌కు చెందిన నగేశ్ గౌడ్ (48) తన మిత్రులతో కలిసి 15వ తేదీ సాయంత్రం శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్న అనంతరం బుధవారం తిరిగి తమిళనాడులోని మధురై చేరుకుని మీనాక్షి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు. రాత్రి అక్కడే ఉండి గురువారం ఉదయం రామేశ్వరం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున బాత్‌రూమ్‌కి వెళ్లొచ్చిన నగేశ్ గౌడ్ ఒక్కసారిగా బెడ్‌పై పడిపోయాడు. గమనించిన తోటి మిత్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ అయ్యేనా!

- అసెంబ్లీలో మంత్రి ప్రకటనతో మళ్లీ తెరపైకి
- పెండింగ్‌లోనే ఉన్న దుబ్బాక
- చిరకాల కల నెరవేరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతోపాటు అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రస్తావన

దుబ్బాక పట్టణం వ్యూ..



దుబ్బాక : రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై చర్చిస్తున్నామని అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో దుబ్బాక రెవెన్యూ డివిజన్ కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరుతుందనే ఆశ ప్రజల్లో నెలకొంది. ఈ సమావేశాల్లోనే రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వం ప్రకటన వెల్లడిస్తుందని నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌కు అన్ని విధాలుగా అర్హత ఉన్నప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో 2016లో ఈ విషయంపై దుబ్బాక పట్టణంలో 45 రోజులపాటు ఉద్యమం తీవ్రంగా జరిగింది. పాత సమితి కేంద్రంగా, తాలుకాగా, నియోజకవర్గం కేంద్రంగా మున్సిపాలిటీగా ఉన్న దుబ్బాకకు రెవెన్యూ డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నా కాకపోవడంపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజన్ కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. నియోజకవర్గం కేంద్రాలైన గజ్వేల్, హుస్నాబాద్‌లను రెవెన్యూ డివిజన్లు చేసి నియోజకవర్గం కేంద్రమైన దుబ్బాకను చేయకపోవడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు.

92 రెవెన్యూ గ్రామాలతో డివిజన్

దుబ్బాక నియోజక వర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్ మండలాలు తూప్రాన్ డివిజన్‌లో ఉన్నాయి. సిద్దిపేట డివిజన్‌లో ఉన్న దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి–అక్బర్‌పేట మండలాలతోపాటు గజ్వేల్ డివిజన్‌లో ఉన్న దౌల్తాబాద్, రాయపోల్ మండలాలతో కలిపి మొత్తం 6 మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరు మండలాల పరిధిలో దుబ్బాక మున్సిపాలిటీతోపాటు 92 రెవెన్యూ గ్రామాలు 115 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2 లక్షలకు పైగా జనాభాతో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, హార్టీకల్చర్ సబ్ డివిజన్ కార్యాలయాలతోపాటు బస్ డిపో ఉంది. కాబట్టి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాకలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఇచ్చిన హామీ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తప్పకుండా నెరవేరుతుందన్న గంపెడాశ ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. 8 నెలల కిందట సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా కలువడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరగడం అందరికీ తెలిసిందే. కాకపోతే తాను దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసమే సీఎం ను కలిశానని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సీఎం సానుకూలంగా ఉన్నారని తప్పకుండా ఈ దిశగా చర్యలు జరుగుతున్నాయనే ప్రచారం జోరందుకుంది.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం



దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి, మేధావులతో కలిసి ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొని అఖిల పక్షం ఆధ్వర్యంలో సీఎం, మంత్రులను కలుస్తాం.

– మాదవోయిన శ్రీకాంత్, అఖిల పక్షం నాయకులు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ట్రాక్టర్‌ను బస్సుఢీకొని ఇద్దరికి

మనోహరాబాద్(తూప్రాన్): ట్రాక్టర్‌ను బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌లో చోటు చేసుకుంది. గురువారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. తూప్రాన్ మండలం రావెల్లి గ్రామానికి చెందిన బోల్ల బోయిన సత్తయ్య యాదవ్ ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన మల్లేశ్ 17వ తేదీన కిరాయికి తీసుకొని మండల కేంద్రంలోని కాకతీయ పైపు పరిశ్రమ కంపెనీకి వెళ్లాడు. పైపులు తీసుకొని తిరిగొచ్చే క్రమంలో రాత్రి 7 గంటల ప్రాంతంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు మర్కష్ తోఫాలే, బిజిలే శంకర్ జల్బాలుకి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ యజమాని సత్తయ్య యాదవ్ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీని ఢీకొట్టిన బైక్..

మనోహరాబాద్(తూప్రాన్): లారీని బైక్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలంలోని పాలాట గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహ్మ బైక్‌పై పని నిమిత్తం తూప్రాన్‌కు బయలు దేరాడు. రామాయపల్లి వద్దకు రాగానే యూటర్న్ చేస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన నర్సింహ్మను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కారు ఢీకొని విద్యార్థికి ..

వెల్దుర్తి(తూప్రాన్) : కారు ఢీకొనడంతో విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని యశ్వంతరావ్‌పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యశ్వంతరావ్‌పేట గ్రామానికి చెందిన భ్యాగరి కళావతి, శ్రీనివాస్ కుమారుడు వంశీ(14) మంగళపర్తి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ప్రత్యేక తరగతులు ముగిసిన అనంతరం కాలినడకన స్నేహితులతో కలిసి ఇంటికొచ్చే క్రమంలో బీటీ రోడ్డు దాటుతున్నాడు. నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వస్తున్న కారు అతివేగంతో వచ్చి వంశీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

దుబ్బాకరూరల్: ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. వెంకటగిరి తండాకి చెందిన అజ్మీరకమల్ నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. బుధవారం రాత్రి శిలాజీనగర్ గ్రామానికి చెందిన పెంబర్తి ట్రాక్టర్ డ్రైవర్ రాకేష్(23) ఇంటి నిర్మాణానికి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్నాడు. వాహనం నడుపుతున్న క్రమంలో ఒక్కసారిగా కిందపడటంతో టైర్లు మీది నుంచి వెళ్లాయి. తీవ్రగాయాలైన అతడిని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇస్రో శాస్త్రవేత్తగా బెజ్జంకి యువకుడు



ఒజ్జపల్లి శ్రీమాన్

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఒజ్జపల్లి శ్రీమాన్ ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒజ్జపల్లి నాగయ్య, సత్యలక్ష్మిల కుమారుడు. 2023లో ఇస్రోలో రాసిన పరీక్షలకు గాను బుధవారం వచ్చిన ఫలితాలలో ఆయన శాస్త్రవేత్తగా ఎంపికయ్యారని తండ్రి నాగయ్య తెలిపారు. బెంగళూరులోని ఐఐఎస్‌సీలో ఎంటెక్ చదివి గోల్డ్ మెడల్ సాధించారు. అమెరికాలోని ప్రసిద్ధ సంస్థ కెడెల్స్‌లో డిజైన్ ఇంజనీర్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. బెజ్జంకి యువకుడు ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికకావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి మహిళ..

చేగుంట(తూప్రాన్): ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని బోనాల గ్రామానికి చెందిన పుల్లబోయిన నాగరాణి భర్త మృతి చెందడంతో గ్రామంలోనే పుట్టింట్లో ఉంటుంది. బుధవారం ఇంట్లో వారంతా వ్యవసాయ పనులకు వెళ్లగా నాగరాణి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయింది. తల్లి శశికళ తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పనికి వెళ్లిన యువతి..

అక్కన్నపేట(హుస్నాబాద్): యువతి అదృశ్యమైన ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ భాస్కర్ కథనం మేరు.. అక్కన్నపేట మండలానికి చెందిన ఓ యువతి(21) హుస్నాబాద్ పట్టణంలోని ఓ దుకాణంలో వర్కర్‌గా పని చేస్తుంది. 14వ తేదీన ఇంటి నుంచి ఎప్పటిలాగే హుస్నాబాద్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

- జార్ఖండ్‌లో అక్కన్నపేట వాసి మృతి
- విధులకు వెళ్తుండగా ఢీకొట్టిన వ్యాన్



ప్రవీణ్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): బతుకుదెరువు కోసం జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ర్యాగటోనిపల్లెకి చెందిన ర్యాగటి సారవ్వ–చంద్రయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన ప్రవీణ్(25) బీటెక్ పూర్తి చేసి జార్ఖండ్‌లో హెచ్‌సీఎల్ సూర్ధ మైన్స్ మైనింగ్ కంపెనీలో ఫోర్ మెన్‌గా ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. రోజు మాదిరిగా గురువారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉన్న ప్రవీణ్ మృతి చెందడం పల్లెవాసులకు కలచివేసింది.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం



విద్యార్థులు గాయత్రీ, అంకిత



మెడల్స్‌తో విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖో ఖో జట్టుకు నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్జానా, పీడీ అశోక్ ఇతర అధ్యాపక బృందం అభినందించారు. ఇటీవల మెదక్ల కేంద్రంలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి ఖో ఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఇందులో విద్యార్థులు దివ్య, ప్రసన్న, ఇందుప్రియ, భవ్య, వర్షిత, శ్రీజ, స్పందన, ప్రణీత, సాహిత, అక్షిత, రమ్య, సుప్రియ ఉన్నారు.

మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ విభాగంలో..

సంగారెడ్డి : సీఎం కప్ క్రీడల్లో భాగంగా అండర్ 19 మిక్స్‌డ్ డబుల్ బ్యాడ్మింటన్ విభాగంలో సగ్గల అక్షయ, ఖలీల్ గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు సంగారెడ్డి జిల్లా తరఫున ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా యువజన క్రీడల అధికారి ఖాసీం బేగ్, సెక్రటరీ జావీద్ అలీ హర్షం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ శారద తెలిపారు. ఆమె కథనం మేరకు.. జిల్లా స్థాయిలో 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో గాయత్రీ మొదటి స్థానంలో, 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో అంకిత రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

- సీపీ అనురాధ
- సిద్దిపేటలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్



జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ, పక్కన ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడం ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశ్యమని సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను బస్టాండ్ చౌరస్తా వద్ద ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్‌లతో కలిసి సీపీ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆర్‌ఏఎఫ్ సిద్దిపేటకు రావడం జరిగిందన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు నిర్వహించి, ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ, మేమున్నామనే భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 20న హుస్నాబాద్ పట్టణం, 21న గజ్వేల్ పట్టణంలో, 22న కొమురవెల్లి మండల కేంద్రంలో, 23న దుబ్బాక పట్టణంలో, 24న సిద్దిపేట వన్ టౌన్ పీఎస్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పట్టణంలో బస్టాండ్ చౌరస్తాతో పాటు ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ బగేల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ రద్దు చేసే వరకు పోరాటం



పరిశ్రమ వద్ద మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట) : పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గుగ్గిల్ల శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యంగా మారే ఫ్యాక్టరీ రద్దు కోరుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారు స్పందించకుంటే రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, రూపేశ్, భాస్కర్, మధు, జనార్దన్, నరేశ్, మహేశ్, శ్రవణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బెజ్జంకిలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐని గ్రామ స్థాయిలో బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అండగా ఉండి పోరాడాలన్నారు.

సంక్షోభంగా మారిన సంక్షేమం

- 6 గ్యారంటీలు, 66 హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రాష్ట్రంలో రైతుల, విద్యార్థుల మరణాలు కలిచివేస్తున్నాయి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమం సంక్షోభంగా మారిందని, అభివృద్ధి అవినీతిగా మారిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో వెంకటేశ్వర్లు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో అవినీతి తప్ప ఎక్కడ అభివృద్ధి దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రతి పక్షాలపై నిందలు వేయడం తప్ప సీఎం చేసిన ఒక్క మంచి పని లేదన్నారు. రేవంత్ రెడ్డి లక్కీగా సీఎం అయ్యాడని ఆయనకు పరిపాలన చేయడం తెలియదని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 50 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వనందుకు లగచర్ల రైతులను ఇబ్బందులు పెట్టి వారి చేతులకు సంకెళ్లు వేయడం సిగ్గుచేటన్నారు. వరి ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం చేసిందన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాక హైడ్రా, మూసీ సుందరీకరణ, ప్రతిపక్షాల అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో వెనుకకు నెట్టేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా సీఎం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, దూది శ్రీకాంత్ రెడ్డి, సొప్పదండి విద్యాసాగర్, విబిషన్ రెడ్డి, కోడూరి నరేశ్, గోనె మార్కండేయులు, లక్కిరెడ్డి తిరుమల, ఉమా సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవకే లీగల్ సర్వీసెస్ అథారిటీ



స్వాతిరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

సిద్దిపేటరూరల్: సమాజంలో హింసలకు, గృహ హింసలకు, లైంగిక వేధింపులు గురయ్యే పేదలకు సేవ చేసేందుకే లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో లైంగిక వేధింపులు, గృహ హింసల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతి రెడ్డి హాజరై మాట్లాడారు. ఎవరైనా పని ప్రదేశాల్లో గాని, మరెక్కడైనా గాని లైంగికంగా వేధింపులకు గురి చేస్తేఅధైర్య పడకుండా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. అంతకుముందు ఏసీపీ మధు మాట్లాడుతూ.. మహిళలపై ఎలాంటి అరాచకాలు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, 24 గంటల పాటు పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం స్వాతిరెడ్డిని గ్రామ మహిళలు ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్‌ఐ అపూర్వరెడ్డి, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి గౌస్, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎనగుర్తిలో కొత్త రాతియుగం నాటి ఆనవాళ్లు

- బండపై ఆది మానవులు తయారు చేసుకున్న పనిముట్ల గుర్తులు
- క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల నాటి పునరావాస ఆనవాళ్లు
- చరిత్ర పరిశోధకుల అన్వేషణలో వెలుగులోకి..



శ్రీనివాస్, చరిత్ర పరిశోధకులు

దుబ్బాక : దుబ్బాక మండలం ఎనగుర్తిలో కొత్తరాతి యుగం నాటి ఆనవాళ్లు వెలుగుచూశాయి. ఇటీవలె చరిత్ర పరిశోధకుల అన్వేషణలో ఎనగుర్తిలో కాశీ విశ్వనాథస్వామి ఆలయం సమీపంలో బండల మీద పురమానవుల ఆనవాళ్లు భయడపడటం విశేషం. ఎత్తైన గుట్ట మీద పెద్ద బండరాయిలపై పుర మానవులు తమ ఆహార సేకరణలో భాగంగా ఉపయోగించే రాతి పనిముట్లు (రాతి గొడ్డళ్లు) నూరుకున్న గుంతలను (గ్రూవ్స్) దాదాపు 20కి పైగా ఉన్నట్లు చరిత్ర పరిశోధకులు గుర్తించారు. ఈ ఆనవాళ్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల కిందట నాటి ఆదిమ మానవులు నివసించినట్లు చరిత్ర పరిశోధకులు తెలిపారు. ఎనగుర్తితోపాటు జిల్లాలోని సిద్దిపేట, నంగునూర్, నర్మెట్ట, వీరారెడ్డిపల్లిల్లోనూ ఆదిమ మానవుల ఆనవాళ్లు ఇది వరకే గుర్తించారు. తాజాగా ఎనగుర్తిలో వెలుగులోకి రావడం ఆసక్తికరంగా మారింది. దీనిపై ఇంకా లోతుగా పరిశోధిస్తున్నట్లు చరిత్ర పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.



పనిముట్లు నూరినట్లు ఆనవాళ్లు



ఆది మానవులు నివసించినట్లు గుర్తించిన ప్రాంతం